# ఒక్క ముద్దివ్వూ!

## —పచ్చిగోళ్ళ సుధ

రాత్రి పదిదాటుతోంది... కళ్ళు మూసుకుపోతుంటే... చదువుతూన్న శ్రీశ్రీ 'మహాప్రస్థానం' పుస్తకం పక్కనపెట్టేసి... మంచం మీదవాలాను.

కళ్ళు మూసుకుపోతున్నా... మనసు ఆలోచించడం మానలేదు... ప్రతిరాత్రీ... ప్రతిపగలూ... తను మనసుతో జరిపే యుద్ధంలో తనెప్పుడూ ఓడిపోతూనే వుంటాడు. ఎప్పుడూ తనకి ఒక్కటే ఆలోచన. ఈ ఒంటరి బ్రతుకులో ఒక్క తోడయినా... దొరక్కపోతుందాన్న చిన్న ఆశ.

ఏదో పోగొట్టుకున్నట్టు పారేసుకున్నట్టుండే తనని జాలిగా చూసేది తన రూమ్ శుభ్రం చేసే గంగ. గంగ ఎప్పుడూ నవ్వుతుంటుంది... సాగే సెలయేరులా. గంగ కూనిరాగం తీస్తూనే... చకచకపనులు చేసేస్తుంది... 'ఏమిటి బాబూ... ఎప్పుడూ... అలా... ఒంటరిగా ఆలోచిస్తూ కూకుంటారు... నేను సూడండి... ఏమీలేకపోయినా అన్నీ వున్నదానిలా ఎలా నవ్వుతూ బతికేత్తున్నానో చూసారా?'' అంటూన్న ఆమె మనోధైర్యాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయేవాడ్ని.

గంగ తనకు పరిచయమయ్యాకనే... చీకటిలో చిన్నదీపంలా... తన జీవితం.. మినుకుమినుకుమంటూ వెలుగుతోంది. ఆమె పని మనిషే కావచ్చు. అయినా గంగలో అనురాగం పంచే... మనసుంది. మొత్తం ఆ చుట్టుప్రక్కల వారందరికీ గంగే పనిచేస్తుంది. ముందుగా తన రూమ్ తలుపే తడుతుంది. పక్కబట్టలు కూడా అదే శుభ్రం చేస్తుంది. దాని అభిమానం అలాంటిది.

ఊళ్ళో వార్తలన్నీ తనే మోసుకొస్తుంది. రూమ్‌లో రేడియో, టీవీలేదన్న బాధను అదేతీర్చింది. ఉదయం అది ఆ విషయం చెప్పిన దగ్గర నుండి ఎందుకో తన మనసు ఒకటే గొడవ చేస్తోంది. ఒక్కసారి ఆమెని చూడాలని, గంటలు గడిచిపోయాయి. సూర్యుడు వెళ్ళి, చంద్రుడు వచ్చినా... తన కోరికతీరలేదు. పుట్టి పెరిగాక ఎప్పుడూ ఎవరి గురించి... తను అంత ఇదిగా ఆలోచించలేదు.

> ఆమె లోపలికి వెళ్ళిపోతుంటే... నా మనసు బాధగా మూలిగింది. ఎందుకో... ఆమెనే చూడాలనివుంది. అలా ఎంతసేపయినా... సరే... అందులో ఎంతో తీయదనం వుంది. ఆమె లోపలికి వెళ్ళిపోతుంటే... తననుండి...

గంగమాటలే పదేపదే... తన మనసుపై అటూ ఇటూ తిరుగుతున్నాయ్. ఒక్కసారి.. ఒక్కసారి .. ఆమెని తను చూడగలిగితే... చాలు... చూడగలడా? అదేమంత పెద్దకష్టం కాదు. రేపు ఉదయమే... ఏదో పని కల్పించుకునైనా... ఆమెను చూడాలి.

తన కోరిక గంగను కూడా ఆశ్చర్యపరిచింది. దాని ఆశ్చర్యానికి కారణం లేకపోలేదు. నిండు యవ్వనంలో అంటే... పదహారేళ్ళ ప్రాయంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న గంగ ఆడతనాన్ని, అందాల్ని ప్రతీమగవాడు వెర్రి చూపులతో జుర్రుకుంటూ చూస్తుంటే... తను కళ్ళులేని గుడ్డివాడిగా గంగ అందాన్ని గమనించకపోవడం... గంగలో ఆశ్చర్యం రేకెత్తించిందని ఆమె ఎన్నోసార్లు తనతో చెప్పింది. అలా... ఎన్నోగంటలు ఆలోచనాసంద్రంలో కొట్టుకుపోతున్న నన్ను ఒడ్డులాక్కొచ్చి, అక్కున చేర్చుకుంది నిద్రాదేవత.

గంగ పిలుపుతో నాకు తెల్లారింది రోజూలా తెల్లారినా.. ఎందుకో నాకారోజు ప్రత్యేకమైన రోజులా అనిపించింది. మనసు ఉత్సాహంగా వుంది. మా రూమ్ కిటికీలోనుండి ఎదురింట్లోకి చూసాను. ఆశ్చర్యం... ఆనందం... తనెప్పుడు చూసినా... మూసివుండే తలుపులు... తెరుచుకుని వున్నాయ్. అలానే చూస్తున్నాను. ఆమె దర్శన భాగ్యం కోసం.

ఆమె భర్తకి టెలిఫోన్ ఎక్స్చేంజ్‌లో ఏదో ఉద్యోగమట. ట్రాన్స్‌ఫర్ నిమిత్తం... రెండురోజుల క్రితమే, ఎదురింట్లో దిగారు. ఈ విషయాలన్నీ నాకెలా తెలిసాయో... మరోసారి చెప్పనవసరంలేదనుకుంటాను

గంగ చెప్పిన దగ్గరనుండే... నా మనసు ఆమెను చూడాలని తహతహలాడుతోంది.

దేవుడు నామీద జాలిచూపాడు. ఆమె లోపలినుండి బయటకువస్తోంది... నాలోస్పందన... ఆమె మనిషిలా లేదు... దేవతలా వుంది. తలారాస్నానం చేసిన కురులనుండి... జాలువారుతున్న నీటిబొట్లు ఆమె కట్టుకున్న చీరను తడుపుతున్నాయ్ ఆమె నుదుట ఎర్రటిబొట్టు... అప్పుడే ఉదయిస్తూన్న సూర్యకిరణంలా, ముప్పయి ఐదు నలభైకి మధ్యలో వుంటుందేమో... ఆమె వయసు. అయినా... శరీరం మాత్రం... దృఢంగా, పుష్టిగా, అందంగా అనిపించింది.

ఆమె లోపలికి వెళ్ళిపోతుంటే... నా మనసు బాధగా మూలిగింది. ఎందుకో... ఆమెనే చూడాలనివుంది. అలా ఎంతసేపయినా... సరే... అందులో ఎంతో తీయ్యదనం వుంది. ఆమె లోపలికి వెళ్ళిపోతుంటే... తననుండి ఆమె ఎంతోదూరం వెళ్ళిపోతున్నట్టు బాధ కలుగుతోంది. ఈరోజు ఎలాగైనా సరే... ఆమె దగ్గరికి వెళ్ళాలి. మనస్ఫూర్తిగా మాట్లాడాలి... అలా దృఢంగా అనుకున్నాక మనసు కొద్దిగా స్థిమితపడింది.

గబగబా స్నానం చేసి డ్రెస్ వేసుకుని, రూమ్‌కి తాళం బిగించి బయటకు వచ్చాను. అప్పుడే ఎదురింట్లో నుండి ఆమె భర్త ఆఫీసుకు బయలుదేరాడు. అదే విలువైన సమయంగా ఎన్నుకుని ఎదురింటివైపు అడుగులు వేసాను.

తడబడుతూనే చిన్నగా తలుపుతట్టాను. ఓ నిముషం గడిచింది. అయినా తెలుపు తెరుచుకోలేదు. మళ్ళీ తట్టాను. ఈసారి కాస్త గట్టిగా. 'ఎవరూ..?' అంటూనే తలుపు తెరిచిన ఆమెనే అలా చూస్తూ ఉండిపోయాను.

''మీరు... మీరు... ఏం కావాలి. ఆయన లేరు... ఆఫీసుకు వెళ్ళారు...'' భయంగా అంది ఆమె.

ఆమెను అలా చూస్తే నాకు నవ్వొచ్చింది. నన్ను నేనే పరిచయం చేసుకున్నాను. మీరు కొత్తగా వచ్చారని మాగంగ చెప్పింది. అప్పట్నుంచి మిమ్మల్ని పరిచయం చేసుకోవాలనుకున్నాను. ఈరోజు కుదిరింది. నాకు పుస్తకాలంటే... చాలా ఇష్టమండి. మీకూ ఇష్టమైతే... ఇదిగో... తీసుకుని చదవండి... అంటూ 'చలం' రచనలు ఆమెకు అందించబోయాను.

వెంటనే ఆమె తీసుకుంది. 'పుస్తకాలంటే... నాకూ చాలా ఇష్టమండీ...?' అంటూ ఆ తర్వాత మా మధ్య మాటలు సాగలేదు. మళ్ళీ నేనే అన్నాను. 'ఈరోజు పాల పేకట్ రాలేదండి... కాఫీలేకపోతే... అసలు వుండలేను... హోటల్స్ చాలా దూరం...' అంటూన్న నన్ను ఒకసారి పరీక్షగా చూసి, ఏమనుకుందో... ఏమో... లోపలికి రండి... కాఫీ తెస్తాను అంది.

అంతే... నా సంతోషం మరి చెప్పాలా? ఆమె చేతి కాఫీ తాగబోతున్న నా మనసు అమృతం తాగినట్టు పిచ్చిగంతులేస్తోంది. వెంకటగిరి జరీ అంచుచీరలో ఆమెనిండుగా... ముద్దమందారంలా వుంది.. కాఫీ అందించే ఆమె చేతులు తెల్లగా మెరుస్తూ... ఆమె రూపుకు మేమే ఆధారమన్నట్టు ఎర్రగాజులు గలగలవుతున్నాయ్

కాఫీ ఇచ్చి ఆమె నా ఎదుట కుర్చీలో కూర్చుంది. 'మీ పిల్లలు ఏరి...?' అడిగాను ఏదో అడగాలన్నట్టు.

ఆమె ముఖం గంభీరంగా మారిపోయింది. 'పిల్లలు లేరు' అంది ముక్తసరిగా, మాతృతం పొందలేని... ఆమె మనసు తాలూకు విచారఛాయలు ముఖం మీదకు వచ్చాయ్. సారీ... మిమ్మల్ని బాధపెట్టాను అన్నాను. మరునిముషమే ఆమె మామూలుగా మాట్లాడింది. ఆమెకు అలా దగ్గరగా... కూర్చుని, ఆమెతో మాట్లాడుతుంటే... నాకెంతో తృప్తిగా, ఆనందంగా వుంది. చాలాసేపు మాటలు అయిన తర్వాత అన్నాను.

మిమ్మల్ని ఒక్కటి అడుగుతాను... ఇస్తారు కదూ! అంటూ.

ఆమె నావైపు కంగారుగా చూసింది. ఆమె కళ్ళు చాలా ఆకర్షనీయంగా వుంటాయ్. కొందరి అందం మొత్తం కళ్ళలోనే వుంటుంది. ఆమె మాట్లాడలేదు. మళ్ళీ నేనే అడిగాను'

ఈసారి ఆమె పెదవులు తడబడ్డాయి... రెప్పలు వాలిపోయాయి. పరిచయంలేని ఇతను ఇంట్లోకి వచ్చి ఏమిటీ... ఈ చొరవ... అన్నట్లు ఒక్కసారి కదిలింది. నాకు అలా ఆమెను చూస్తుంటే... ఆమె ఒడిలో వాలిపోవాలని... వుంది. ఆమెచేతుల మధ్య లాలన పొందాలని వుంది. అందుకే...తెగించి మళ్ళీ అడిగాను.

'ఏం... కావాలి?' అదోలా అడిగింది ఆమె.

'ముద్దు...' వెంటనే అడిగేసాను. ఏదో కాఫీ అడిగినంత ఫ్రీగా.

'అంతే...' నా చెంప చెళ్ళుమంది. మొదటిసారిగా ఒకేఒక స్పర్శ నన్ను బాధపెట్టలేదు కానీ... తీపిని అందించింది.



అంతే... ఆమె రెండు చేతులూ పట్టుకున్నాను.. 'అమ్మా!' పిలిచాను... తన్మయతతో. ఆమె కదిలిపోయింది. నన్ను అలా చూస్తుండిపోయింది. అమ్మా! ఇలా పిలువనిస్తావు కదూ! దురదృష్టవంతుడ్ని... నా చిన్నతనంలోనే అమ్మ యాక్సిడెంట్‌లో పోయింది. నాన్న ఎవరో అమ్మకే తెలియని పరిస్థితి. ఒంటరిగా ఈ భూమ్మీద... దూళిలా ఈశరీరం ఇంత ఎదిగింది. ఈ ఒంటరితనంలో లాలన, పాలన, ఆప్యాయత, అనురాగం, ఇవేమి కనిపించలేదు. ప్రపంచంలో ఓ మూలగా, పురుగులా ఏమిటో ఈ బ్రతుకు. ఏం తిని పెరిగానో పెరిగాను. అమ్మ పోయాక నాకేంచేయాలో తోచలేదు. నాకున్న ఆస్తి అమ్మ ఫోటో ఒక్కటే.

ఆ ఫోటో ఎదురుగా కూర్చుని ఏడ్వడం తప్ప ఏం తెలియని నన్ను అనాధాశ్రమం గుండెల్లో దాచుకుంది. ఫోటోలో అమ్మలాగే నువ్వు వున్నావని గంగ నాతో చెప్పిన క్షణం నుండి... నిన్ను చూడాలని. పోయిన అమ్మ ప్రేమను పొందాలని, జీవితానికి సరిపడా ఒక్క ముద్దు... ఒక్క ముద్దు... నా నుదుట పచ్చబొట్టులా... నిలుపుకోవాలని తాపత్రయపడ్డాను.

అందుకేనమ్మా... నిన్ను చూడాలన్న ఆశతో... ఇలా... ఇలా... అంటూన్న నాకు ఇక మాటలు పెగల్లేదు. కళ్ళు వర్షిస్తున్నట్టు కూడా నాకు చాలాసేపు వరకూ తెలియలేదు.

ఆమె... అప్పటికి... ఊహు... ఆమె కాదు... అమ్మ...! అమ్మ అప్పటికి తేరుకుంది. నాకథ విని చలించింది. ఆమె కళ్ళలో ఓ కన్నీటి తెర. ఆ తెరవెనుక ఆప్యాయత, అనురాగం.

నా ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకుని... 'బాబూ' అంటూ నా నుదట ఒకే ఒక్క గాఢమైన ముద్దిచ్చింది. నా పద్దెనిమిదేళ్ళ వయసూ... పసివాడిలా పరవశించింది.

తల్లిలేని నా మనసూ, బిడ్డలులేని ఆమె మనసూ... ఒకేలా శోకిస్తున్నట్టనిపించింది. ఒకరు అందించిన ప్రేమకు ఒకరు కృతజ్ఞతగా రెండేసి కన్నీటిబొట్లు రాలిపడ్డాయ్!

*